## పదిలో 100 ఫలితాలు సాధించాలి

**పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి**

**మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ప్రతి పాఠశాలలో కూడా అన్ని మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూసుకోవాలని, పదో తరగతిలో 100 ఫలితాలు సాధించాలని, సిలబస్ పూర్తి చేయాలని , పాఠశాలలకు సంబంధించిన పెండింగ్లో ఉన్న సమాచారాన్ని ఆన్‌లైన్ లో పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులకు, అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం మధ్యాహ్నం డైట్ కళాశాల మీటింగ్ హాల్ లో పాఠశాలలలో అమలవుతున్న అన్ని కార్యక్రమల అమలు పై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలల్లో ప్రతి పాఠశాలలో కూడా అన్ని కార్యక్రమాలు వంద శాతం అమలు చేయాలని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా కాదు అంతకు మించి ప్రభుత్వ పాఠశాలలు వుండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ , సీఎంఓ సుధాకర్ రెడ్డి , ప్లానింగ్ కోఆర్డినేటర్ ప్రశాంత్, జిసిడివో అశ్రాఖాద్రి, అన్ని మండలాల విద్యాధికారులు, అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ ప్రవీణ్ కుమార్

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డా. రామకృష్ణ**

**ఉప్పునుంతల,డిసెంబరు30 ప్రభాతవార్త :** వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా. రామకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆసుపత్రి ప్రగతి, వచ్చే రోగుల నివేదిక, ఆస్పత్రి సిబ్బంది హాజరు నివేదికతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది పాటించాల్సిన నియమ, నిబంధనలు, రోగుల పట్ల వైద్య సిబ్బంది ప్రవర్తించాల్సిన పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాల సంఖ్యను పెంచాలని, వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో సమావేశంలో డిసిహెచ్ఎస్ డా. రామకృష్ణ తోపాటు, స్థానిక వైద్యాధికారిణి డా. స్వప్న, డా. అభిలాష్, నర్సింగ్ ఆఫీసర్ ఉపత్, సుశీల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న డా. రామకృష్ణ

## నట్టల నివారణకు మందులు పంపిణీ

**దామరగిద్ద, డిసెంబరు 30 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కోసం మందులు గ్రామ సర్పంచ్ అద్దన్ కనికిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నట్టలు పూర్తిగా నశించడం వల్ల పశువుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తహీనత, బలహీనత వంటి సమస్యలు తగ్గుతాయి. బరువు వేగంగా పెరిగి మాంస ఉత్పత్తి మెరుగవుతుంది. పాలు ఎక్కువగా ఇవ్వడంలో సహాయం చేస్తుంది. వ్యాధులు సోకే అవకాశాలు తగ్గుతాయి. చర్మ వ్యాధులు, గాయాలు తగ్గి పశువులు చురుకుగా ఉంటాయి. పిల్ల గొర్రెలు, పిల్ల మేకల మరణాల శాతం తగ్గుతుంది. పశుపోషకులకు ఆర్థిక లాభం కలుగుతుంది. మందు వాడటం వల్ల పశువుల జీవనకాలం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కురుమప్ప, నాయకులు వెంకట్రామిరెడ్డి, ఆనంద్, అశోక్ గౌడ్, క్యాసారం రాజు, తమ్మాళి రఘు, ఊదరి నర్సప్ప, పశు వైద్య సిబ్బంది, గొర్ల పెంపకం దారులు పాల్గొన్నారు.

## యాసంగి పంటలకు యూరియా కొరత లేదు

**గద్వాల డిసెంబర్ 30, ప్రభాతవార్త:** యాసంగి పంటలకు యూరియా కొరత లేదని గద్వాల మండల వ్యవసాయ అధికారి ప్రతాప్ తెలిపారు. గద్వాల మండల పరిధిలోని రైతుల పంటలకు యూరియా సరిపడా నిల్వలు ఉన్నాయన్నారు. గద్వాల పి ఏ సి ఎస్ సొసైటీలో ఎ. ఆర్. ఎస్.కె 1, ఎ.ఆర్.ఎస్.కె 3 గద్వాల రైతులకు తగినన్ని, మొదటి దఫా ఎరువులు నిల్వ పొందగలరనీ, రైతులు మూరియా కొరత వస్తుందని ఆందోళన చెందాల్సిన అవసతము లేదని, రైతులకు తగినన్ని నిల్వలు ఉన్నాయన్నారు. రైతులు గుము గూడి, పంట కాలమునకు అవసరమైన యూరియా సంచులు తీసుకొనగా, మొదటి దఫాలో అవసరమున్న సంచులు తీసుకొనగలరని తెలిపారు. రైతులు తప్పనిసరిగా, వారి పట్టాపాస్ బుక్,ఆధార్ కార్డ్ జిరాక్సులతో రాగలరనీ, ఇవి కాక ప్రవేటు దుకాణములో కూడ మూరియా నిల్వలు ఉన్నాయని , యూరియా కొనుకోలు పై ఎట్టి సమస్యలు ఎదురైన గద్వాల మండల వ్యవసాయాధికారిని సంప్రదించగలరని తెలిపారు.

## గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

**ఉప్పునుంతల, డిసెంబరు 30 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక వైద్య అధికారిణి డా. స్వప్న ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత జాగ్రత్తలు, చలి తీవ్రత అధికంగా ఉండడంతో వెచ్చని తాగు నీరు, దోమలు కుట్టకుండ జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు పలు సూచనలు ,సలహాలు ఇచ్చారు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో వైద్యాధికారిణి డా. స్వప్న తో పాటు,ఏఎన్ఎం జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ జగదీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది రానియ్యొద్దు

**ఎరువుల పంపిణీ సక్రమంగా నిర్వహించాలి**

**ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్**

**మహబూబ్‌నగర్,డిసెంబరు 30 ప్రభాతవార్త:**జిల్లాకేంద్రంలో డిసిఎంఎస్ ఎరువుల డీలర్ షాప్‌ను జిల్లావ్యవసాయ అధికారి బి.వెంకటేష్ మంగళవారం తనిఖీ చేశారు.ఈసందర్భంగా డిసిఎంఎస్ ఎరువుల డీలర్ వద్ద ఎరువుల నిల్వలు, అమ్మకాలు, రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికలను ఆయన పరిశీలించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువుల పంపిణీ సక్రమంగా నిర్వహించాలని సూచించారు.జిల్లాలో సాగుకు అవసరమైన ఎరువులునిల్వలు ఉన్నాయని,యూరియా కొరత లేదని తెలిపారు.మొబైల్‌యాప్ ద్వారా జిల్లాలో 16,933మంది రైతులు,50,087 ఎరువుల బస్తాలు బుక్ చేసుకున్నారని,అందులో 40,337 ఎరువులు బస్తాలు రైతులు కొనుగోలు చేయటం జరిగిందని తెలిపారు. ఇంకా మార్క్ ఫెడ్ లో 56,660 ఎరువుల బస్తాలు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడి.,మండల వ్యవసాయ అధికారి ఉన్నారు.

## గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ

**నారాయణపేట,డిసెంబరు30 ప్రభాతవార్త:**నారాయణపేట జిల్లా ఉట్కూర్ గ్రామలో గొర్రెలు,మేకల్లో నట్టల నివారణ మందు పంపిణీ నిర్వహిచారు. ఈ సందర్భంగా మండల గ్రామ సర్పంచ్ రేణుక భరత్, పశు వైద్య అధికారి సాయి వరుణ్ మాట్లాడుతూ పశువులకు నట్టల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, సమయానుకూలంగా మందులు వేయడం ద్వారా వాటిని నివారించవచ్చని తెలిపారు. పశువుల ఆరోగ్యం కాపాడటంతో పాటు పశు సంపద పెంపుదలపై రైతులు, గొర్రెల కాపరులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. పశుసంరక్షణ కార్యక్రమాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రాధిక, ఎల్ఎస్ఏ ఆంజనేయులు, ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు అశోక్ గౌడ్, రవికుమార్, బాలాంజనేయులు, రైతులు చున్ను, ప్రకాష్‌తో పాటు గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని వినతి

**ఉప్పునుంతల, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** మండలంలో అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని మంగళవారం తహసీల్దార్ అద్దంకి సునీతకు వినతి పత్రం అందజేశారు. మొల్గర సమీపంలో ప్రవహిస్తున్న దుందుభి వాగు నుంచి రాత్రి వేళల్లో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని, సోమవారం వాగు ప్రాంతంలో ఇసుకను తరలించకుండా గోతులు తీయగా, రహదారికి తీసిన గోతులు పూడ్చివేసి ఇసుకను తరలిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో దుందుభి వాగు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరు తో పాటు తాగునీరు సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని వారు విన్నవించుకున్నారు. తహసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన వారిలో పెద్దాపూర్ సర్పంచ్ వంగ సాయిబాబు, బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, శ్రీపురం సుమన్ రెడ్డి, రాజేందర్ రావుతో పాటు పలువురు ఉన్నారు.



అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని తహసీల్దార్ కు వినతి

# అవినీతి అధికారిని కాపాడుతున్న ఉన్నతాధికారి ఎవరో తేలాలి

**అవినీతిలో కూరుకుపోయిన డిఎస్ఓపై చర్యలు తీసుకోవాలి**

**ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని విచారణకు ఎలా పంపిస్తారు..?**

**అనుమతి లేని రైస్ మిల్లుకు ఎలా ధాన్యం దింపుతున్నారు..?**

**జిపిఎస్ సిస్టం లేకుండానే లారీలను నడుపుతున్న వైనం**

**డీఎస్ఓ అవినీతిపై తెలంగాణ సిఎస్‌కు బీసీ పొలిటికల్ జేఏసీ ఫిర్యాదు**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాచాల

**వనపర్తి, డిసెంబరు 30 ప్రభాతవార్త:** అవినీతిలో కూరుకుపోయిన జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదులో తెలంగాణ సిఎస్ రామకృష్ణారావును కలిసిన బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు డిఎస్ఓ అవినీతి, అక్రమాలపై, ఆయనకు సహకరిస్తున్న ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పెబ్బేరు మండలంలోని అనుమతి లేని ఒక రైస్ మిల్లులో అక్రమంగా వడ్లు దిగుతున్నాయని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు తెలుసుకొని అక్కడికి వెళ్లి సందర్శించి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. విచారణకు వెళ్లిన డిఎస్ఓ నిస్సిగ్గుగా రైతుల ధాన్యమని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఎస్ఓను విచారణకు పంపించడం దేనికి సంకేతం అని, పట్టపగలు అవినీతితో దొరికిన కూడా వాటిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం డిఎస్ఓ చేస్తున్నాడని, అవినీతి అధికారులు అంతా కలిసి వనపర్తి పరువు తీస్తున్నారని మండిపడ్డారు. అనుమతి లేని మిల్లులలో వడ్లు ఎలా దింపారని...? అనుమతి లేని మిల్లులో ఎలా నిల్వ చేస్తున్నారని..? పిఎసిఎస్ సెంటర్ నుంచి ఎలా వచ్చాయని..? ఇప్పటివరకు ఎన్ని గన్ని బ్యాగులకు ముద్రలు వేశారని..? జిపిఎస్ సిస్టంతో నడవాల్సిన లారీలకు ఎన్ని జిపిఎస్ సిస్టమ్స్ అమర్చారో తెలపాలని ప్రశ్నించారు. అదేవిధంగా సెంటర్ కోడ్ కూడా ముద్రించడం లేదన్నారు. పెబ్బేరు పిఎసిఎస్ మొత్తం కూడా నేడు అవినీతిమయంలో ఉందని, పక్క జిల్లాలోని రైస్ మిల్లర్లు పెబ్బేరు మండలం లోని గోదాముల్లో అక్రమంగా తప్పుడు ట్రక్ షీట్స్ సృష్టించి నిల్వ చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. యంత్రాలు లేని మిల్లులకు ధాన్యం ఇచ్చినా, విద్యుత్ సదుపాయం లేని మిల్లులకు ధాన్యం ఇచ్చినా, తనకు నచ్చిన వారిని ఒకలా, నచ్చని వారిని మరోలా చూసినా, తాజాగా అనుమతి లేని రైస్ మిల్లుకు ధాన్యం ఇచ్చిన కూడా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా అవినీతి అధికారినే వెనకేసుకురావడం ఏంటని విస్మయం వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు బీసీ పొలిటికల్ జేఏసీకి ముఖ్యమని, అవినీతి అధికారులు ఎంతటి వారైనా తప్పు చేస్తే ఊరుకునేదే లేదని, విచారణ రిపోర్ట్ ఆధారంగా తదుపరి సీఎం ఏసీబీ అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలిగల్ల సాయిబాబా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన సంవత్సర వేడుకలు

## ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: జిల్లా ఎస్పీ

**నారాయణ పేట, డిసెంబరు 30 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతమైన, స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ డా. వినీత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలను ఉల్లంఘించినట్లయితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, డిసెంబర్ 31 రాత్రి జాతీయ రహదారులు, ప్రధాన రహదారులపై వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధించబడిందని ఎస్పీ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురి చేయవద్దని యువతకు సూచించారు. మద్యం దుకాణదారులు నిర్దేశిత సమయం వరకే విక్రయాలు చేయాలని, అర్ధరాత్రి గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని స్నేహపూర్వక వాతావరణంలో శుభాకాంక్షలు తెలుపుకోవాలని సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడతాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు,టాస్క్ ఫోర్స్, షీ టీమ్స్, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తాయని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని,డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయానికి మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు డ్రంకెన్ అండ్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అర్ధరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, బైక్ రేసులు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు కొనసాగుతుందని ఎస్పీ డా. వినీత్ తెలిపారు.



నారాయణపేట జిల్లా ఎస్పీ డా.వినీత్

## రవీంద్రభారతిలో మండల సర్పంచులకు సన్మానం

**నవాబుపేట,డిసెంబరు 30 ప్రభాతవార్త:**హైదరాబాదులోని రవీంద్ర భారతిలో మంగళవారం ముదిరాజు సర్పంచుల సన్మాన సభ నిర్వహించారు. నవాబుపేట మండల నూతన సర్పంచులు ఇప్పటూరు సర్పంచ్ రవికిరణ్, మల్లారెడ్డిపల్లి సర్పంచ్ తోటరాములు, కూచూరు సర్పంచ్ పిట్టల రవి,అమ్మాపూర్ సర్పంచ్ అంతయ్య, కామారం సర్పంచ్ నరేష్, పల్లె గడ్డ సర్పంచ్ బాలరాజు, కామారం సర్పంచ్ వెంకటేష్‌లకు ఘనంగా ప్రముఖుల చేత సన్మానం చేయడం జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా గెలుపొందిన ముదిరాజ్ సర్పంచులకు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రీడలు, యువజన మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, ముదిరాజ్ కోపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజులు హాజరయ్యారు. రాష్ట్ర చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజు, ఈటెల రాజేందర్,ఎంపీ బండ ప్రకాష్,రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్,మత్స్యశాఖ సహకార సంఘం మహబూబ్‌నగర్ జిల్లా చైర్మన్ గోనెల శ్రీనివాసులు, పాలమూరు ముదిరాజ్ సర్పంచులు, ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను సన్మానించిన దృశ్యం

## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**యూరియా కొరత లేదు.. మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్**

**ఉప్పునుంతల, డిసెంబరు 30 ప్రభాతవార్త :** ప్రస్తుతం యూరియా కొరత ఏమాత్రం లేదని , మండలంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉప్పునుంతల తోపాటు హకా తాడూరు కేంద్రాల ద్వారా రైతులకు యూరియాను నిరంతరంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతుల అవసరాలకు తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యూరియా పంపిణీ, విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని ఆయన వెల్లడించారు. ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే యూరియాను విక్రయించాల్సిందిగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అధిక ధరలకు విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అనధికార విక్రయాలు జరిగినట్లయితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కొర్ర రమేష్ హెచ్చరించారు. రైతులు అవసరమైన మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వలు చేసుకోకూడదని ఆయన కోరారు. రైతులు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వ్యవహరించాలని మండల వ్యవసాయ అధికారి రైతులను కోరారు.

## రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

**మక్తల్ టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ నిర్వహణ కార్యదర్శి ఉషారాణి ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా ఎస్ జిఎఫ్ కార్యదర్శి జి. శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం రిటైర్డ్ పిఈటి ఆధ్వర్యంలో పాల్గొన్న 16 మంది బాలబాలికలు ఈనెల 29 ,30 తేదీలలో మేడ్చల్ జిల్లా కీసర లో జరిగిన స్కూల్ గేమ్స్ సైకలింగ్ పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు పాల్గొని, అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించారు. రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో మంచి ప్రతిభ చాటిన, 19 సంవత్సరాలలోపు బాలికల విభాగంలో దీక్షిత మూడోస్థానం, పల్లవి నాలుగో స్థానం, అంబికా ఐదో స్థానం, అభిజ్ఞ 6 స్థానం, 17 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో కే. శ్రీకాంత్, ఐదో స్థానం,కే.నవీన్ ఆరో స్థానం, ఎం శ్రీకాంత్ ఏడోస్థానం, బాలికల విభాగంలో ప్రణీత ఐదో స్థానం, జ్యోతి ఆరో స్థానం, త్రివేణి ఆరో స్థానం, పూజ ఏడో స్థానం పొంది మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందినట్లు బి.గోపాలం తెలిపారు.14 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో దర్శన్ ఆరో స్థానం, బాలికల విభాగంలో తేజశ్రీ నాలుగో స్థానం ,గీతిక ఐదో స్థానం ,నవ్య ఏడో స్థానం, శశిప్రియ 8వ స్థానం సాధించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సైకలింగ్ పోటీలలో ప్రతిభ చాటిన సైక్లింగ్ రైడర్‌ను జిల్లా సైకిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం, జిల్లా స్కూలు గేమ్స్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్ అభినందించారు.




ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన దృశ్యం

## మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన

**నారాయణ పేట, డిసెంబరు 30 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో డ్రగ్స్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో యాంటీ నార్కోటిక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌పై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందన్నారు. జిల్లాలో గంజాయి సాగు సంఘటనలు లేవని డీఏవో జాన్ సుధాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాల స్థాయిలోనూ మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ గత నవంబర్‌లో 12 కిలోల గంజాయి పట్టుకుని 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యా సంస్థల్లో పోలీస్ స్టేషన్ వారీగా యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాహనాల తనిఖీలు, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచినట్లు వివరించారు. కొత్త సంవత్సరంలో మరిన్ని యాంటీ డ్రగ్స్ కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. పబ్లిక్ ప్రదేశాలు, మద్యం షాపులు, బార్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ప్రతి ఆటో వెనుక యాంటీ డ్రగ్స్ పోస్టర్లు ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ నిషేధాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.




మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను

## నేడు శ్రీ కురుమూర్తి గిరి ప్రదక్షిణ

**చిన్న చింతకుంట, డిసెంబరు 30 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలవబడుతూ పాలమూరు తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి గిరి ప్రదక్షణ బుధవారం నిర్వహిస్తున్నారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కురుమూర్తి గిరి ప్రదక్షణకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని వీహెచ్ పి ,బజరంగ్ దళ్ నేతలు తెలిపారు.ఉదయం 10 గంటల నుంచి శ్రీ కురుమూర్తి స్వామి గిరి ప్రదక్షణ ప్రారంభమవుతుందని భక్తులు తరలివచ్చి శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకుని గిరి ప్రదక్షణలో పాల్గొనడం వల్ల సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

## తాటికొండలో 'ఏక్‌భారత్ శ్రేష్ట్ భారత్'

**భూత్పూర్,డిసెంబర్ 30,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం తాటికొండ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్' పేరిట చిత్రలేఖనం పోటీలో పాల్గొని తమ దేశభక్తిని చాటారు.జాతీయ భావం,సమైక్యతా భావాన్ని చాటే విధంగా విద్యార్థులు చిత్రలేఖనంలో అందమైన చిత్రాలను గీసి పలువురు ప్రశంసలు పొందారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల హెచ్ఎం బైకాని బాలు యాదవ్ మాట్డాడుతూ ఏక్ భారత్ శ్రేష్టభారత్ ద్వారా విభిన్న రాష్ట్రాల సంస్కృతి,భాషలు.ఆహారపు అలవాట్లపై విద్యార్థులు చక్కటి అవగాహన కల్గించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కమిటీ సభ్యులు హిందీ ఉపాధ్యాయులు పట్నం చెన్నయ్య,గణిత ఉపాధ్యాయులు వెంకటేష్,తెలుగు ఉపాధ్యాయురాలు లక్ష్మిస్వరూప, కంప్యూటర్ ఉపాధ్యాయుడు సురేష్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి మొదటివిజేతగా విజయలక్ష్మీ

**అయిజ డిసెంబర్ 30, ప్రభాతవార్త:** జిల్లాస్థాయి గణిత టాలెంట్ టేస్ట్ లో మండల పరిధిలోరి కిష్టాపురం,వెంకటాపురం స్టేజీ గ్రామాలకు చెందిన కుమ్మరి మాణిక్యమ్మ రాజు దంపతుల పెద్దకూతురు కె.విజయలక్ష్మి మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి గణిత టాలెంట్ టేస్ట్ పోటీలలో మొదటివిజేతగా గెలుపొందింది.ఇందులో భాగంగా జిల్లాఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదిగా మెమొంటో ప్రశంస పత్రం విజయలక్ష్మి అందుకున్నారు.వడ్డేపల్లి మండలం తనగల జడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విజయలక్ష్మి జిహెచ్ఎం కె. కవిత, గణిత ఉపాధ్యాయులు కురుమూర్తి,గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

## ఎల్ఓసి అందజేసిన మంత్రి వాకిటి శ్రీహరి



**మక్తల్ టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణానికి చెందిన నరేష్ తండ్రి శివలింగప్పనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం పశుసంవర్ధక, పాడిపరి శ్రమాభివృద్ధి,మత్స్య,క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని సంప్రదించగా వారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద నాలుగు లక్షల రూపాయల ప్రపోజల్ ను మంజూరు చేశారు. సంబంధిత ప్రపోజల్ ఎల్ఓసిని మంత్రి మంగళవారం మక్తల్ పట్టణంలో వారికి అందచేయడం జరిగింది. మంచి వైద్యం అంది,బాధితుడు త్వరగా కోలుకోవాలని కాంక్షి ంచారు.

## కాలువలో పడి వ్యక్తి మృతి

**శ్రీరంగాపూర్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందడం జరిగింది. వివరాల్లోకి వెళితే సోమవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన చాకలి అమరచింత గణేష్ తండ్రి ఈశ్వ రయ్య (32) సాయంత్రం నాలుగు గంటల సమయంలో శ్రీరంగాపురం ఊరు బయట కాలువలో బట్టలు ఉతుక్కుంటూ ఉండగా ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడి కొట్టుకుపోవడం జరిగింది. మంగళవారం ఉదయం అమరచింత గణేష్ మృతదేహం కాలువలో దొరికింది. మృతునికి వివాహం జరిగి తొమ్మిది సంవత్సరాలు కాగా అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని తండ్రి ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు కేసు నమోదు చేశామని మృత దేహానికి వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.

## నట్టల నివారణ మాత్రలు పంపిణీ

**ఉప్పునుంతల,డిసెంబరు30 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,తెలంగాణ పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్నశిబిరంలో భాగంగా మంగళవారం పశుసంవర్ధకశాఖ ఉప్పునుంతల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్య శిబిరం మండలంలోని తాగునీరు,తిప్పాపూర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ వైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో 3663 జీవాలకుఉచితంగా నట్టలనివారణ మందులు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సర్పంచులు ఏలేటి అలివేలమ్మ, తిప్పాపూర్ సర్పంచు రాజ పుత్ర మహేష్ సింగ్, పశువైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి చందులాల్ ఉప సర్పంచులు అశోక్, చంద్రయ్య,స్థానిక నాయకులు ఏలేటి ఎల్లయ్య, మాజీ స్థానిక నాయకులు తిరుపతయ్య, చంద్రయ్య, వైద్య సిబ్బంది జెవిఓ శ్రీను, ఓస్ మిరాజ్,హాబీస్, గోపాల మిత్రులు ముజీబ్, శ్రీను తో పాటు ఆయా గ్రామాల జీవాల పెంపకం దారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, డిసెంబరు 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉడుములగిద్ద గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం గురించి రబీ పంటలో రైతులు సహజ సిద్ధ పద్ధతిలో పంటలు పండించాలని క్రిమి సంహారక మందులు వాడరాదని వాటర్ సంస్థ క్లస్టర్ ఇంచార్జ్ బోయిలపల్లి వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమి సంహారక మందుల వల్ల నేలపైన మనుషుల పైన పక్షులు జంతువుల పైన చెడు ప్రభావం చూపుతున్నాయని నేలను పాడు చేస్తున్నాయని వర్షాలు పడ్డ తర్వాత ఆ మందులు భూమిలో మనం త్రాగే నీటి రూపంలో మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. ప్రధానంగా గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్ వంటి ప్రాణాంతకమైన రోగాలకు దారి తీస్తాయని అన్నారు. అలాగే డబ్బులు కూడా వృధా అవుతావని రైతులు తమ పొలం దగ్గరే అవసరమైన డీ కంపోజర్, జీవామృతం, పంచగవ్య వంటి అవసరమైన పంటలకు నాణ్యత పెంచే పుష్టికరమైన ఎరువులని చాలా సింపుల్ గా పొలం దగ్గరనే తయారు చేసుకోవచ్చు అని రైతులకు గ్రామ సభ ద్వారా వాటర్ సంస్థ తరఫున అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యకమంలో గ్రామ సర్పంచ్ సత్యమ్మ, ఉప సర్పంచ్ పెద్దింటి తాయప్ప, వార్డు మెంబర్లు పి. మధు, టి. మహేష్, ఎన్ రాములు, వాటర్ సంస్థ క్లస్టర్ ఇంచార్జ్ బోయిలపల్లి వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

**మద్దూర్, డిసెంబరు30 ప్రభాతవార్త:** మద్దూర్ మండలంలోని ఉద్యాన వ్యవసాయ శాఖ మరియు మద్దూరు ప్యాక్స్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఆయిల్ పామ్ పంట సాగు విధానాలు, నీటి వినియోగం, ఎరువుల వినియోగం, పంట సంరక్షణ అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మద్దూర్ మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట మద్దూర్ మండల వాతావరణానికి అనుకూలంగా ఉండటంతో పాటు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం ఇచ్చే లాభదాయకమైన పంటగా మారిందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో ఆధునిక పద్ధతులు అనుసరిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు. అలాగే ఉద్యాన శాఖ అధికారి హర్షవర్ధన్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ పామ్ నూనెకు మార్కెట్‌లో పెరుగుతున్న డిమాండ్ రైతులకు మంచి అవకాశమని పేర్కొన్నారు. తహసీల్దార్ మహేష్ గౌడ్, ఎంపీడీఓ రామన్న పాల్గొని మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని, ప్రభుత్వం రైతులకు పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫీడ్ సిబ్బంది జ్యోతి, ప్రియ, పిఎసిఎస్ సిబ్బంది, ఫీల్డ్ ఆఫీసర్లు రైతులు పాల్గొన్నారు. రైతులు అడిగిన వివిధ సందేహాలకు వ్యవసాయ అధికారులు స్పష్టమైన సమాధానాలు అందించారు.

# తాటికొండలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్




వంటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**మహబూబ్‌నగర్, డిసెంబరు30 ప్రభాతవార్త:** జడ్‌పిహెచ్‌ఎస్ తాటికొండలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా మంగళవారం వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం (డ్రాయింగ్) పోటీలు నిర్వహించగా, దాదాపు 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ భావం, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు వివిధ ఆకర్షణీయమైన చిత్రాలను వేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. అనంతరం హర్యానా రాష్ట్ర సంస్కృతిని పరిచయం చేయడం లక్ష్యంగా హర్యానా వంటల పోటీ నిర్వహించబడింది. ఈ పోటీలో సుమారు 40 మంది విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ హర్యానా వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల హెడ్‌మాస్టర్ బాలు యాదవ్ మాట్లాడుతూ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం ద్వారా దేశంలోని విభిన్న రాష్ట్రాల సంస్కృతి, భాషలు, ఆహార అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని ఇలాంటి కార్యక్రమాలు జాతీయ సమైక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని"అన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు సంస్కృతిక కార్యక్రమాల్లోనూ ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కమిటీ సభ్యులు, హిందీ ఉపాధ్యాయులు పట్నంచెన్నయ్య, గణిత ఉపాధ్యాయులు వెంకటేష్, తెలుగు ఉపాధ్యాయిని లక్ష్మీ స్వరూప, కంప్యూటర్ ఉపాధ్యాయులు సురేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**దామరగిద్ద, డిసెంబరు30 ప్రభాతవార్త:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం దామరగిద్ద మండల కేంద్రంలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మండల అధ్యక్షులు మహేష్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భాను ప్రసాద్ ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పిడుగు కనకప్ప యాదవ్ మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ చరిత్రను వివరించారు. 1970 డిసెంబర్ 30న కేరళలోని తిరువనంతపురంలో విద్యార్థుల హక్కుల కోసం ఈ సంఘం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పవన్ కుమార్, దామరగిద్ద మండలనాయకులు మహేష్ కుమార్‌యాదవ్, పిడుగు కనకప్ప యాదవ్ పాల్గొన్నారు.

# వసతి గృహాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

**ఆత్మకూర్ డిసెంబర్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న ప్రభుత్వ వసతి గృహాలలో తక్షణమే సీజనల్ వ్యాధులకు సంబంధించి విద్యార్థినీ విద్యార్థులకు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కుతుబ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ మరియు బిసి వసతి గృహాలను ఆయన సందర్శించి విద్యార్థుల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గడచిన పదిరోజులుగా ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థిని విద్యార్థులు జలుబు మరియు దగ్గు టైఫాయిడ్ వంటి రోగాలతో సతమతమవుతున్నారని ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నివారణ చర్యలు చేపట్టడంలో ఘోరంగా విఫలమవుతు న్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత శీతాకాలంలో విద్యార్థినీ విద్యార్థులకు వసతి గృహాల్లో సరైన సదుపాయాలు లేకపోవడం చేతచలికి తట్టుకోలేకసీజనల్ వ్యాధుల బారిన పడి సతమతమవుతున్నారని ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తద్వారావిద్యార్థిని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు విజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

**లింగాల, డిసెంబరు30 ప్రభాతవార్త:** పిల్లలను అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంఈఓ బషిర్ అహ్మద్ అన్నారు. మంగళవారం లింగాల మండలంలోని కె.సి తాండ, అంబట్ పల్లి, రాయవరం, దత్తారం, కోమటికుంట గ్రామాల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఈఓ బషిర్ అహ్మద్ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియల అందరికి వచ్చే విధంగా చూడాలని సూచించారు. ప్రతి పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు వంద శాతం నమోదయ్యే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ సిఆర్పి పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బషిర్ అహ్మద్

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఎంబిబిఎస్ విద్యార్థులకు వైట్ కోర్ట్ పంపిణీ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి**

**గద్వాల డిసెంబర్ 30, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నూతన ఎంబిబిఎస్ విద్యార్థులకు వైట్ కోట్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెడికల్ కాలేజిలో నూతన లైబ్రరీ, కంప్యూటర్ విభాగాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతం ఇటు కర్నూలు అటు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా మధ్యలో ఉన్నదనీ, ఏ చిన్న సమస్య వచ్చినా కర్నూల్ కు రాయిచూర్ కు వెళ్ళే పరిస్థితి ఉండేదనీ, గద్వాల ప్రాంతంలో మెడికల్ కాలేజీ రావడం వల్ల భవిష్యత్తులో అలాంటి పరిస్థితి రాదనీ గద్వాలలోనే ప్రజలకు మెరుగైన వైద్యము అందించే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీని భవనంలో కొనసాగించడం జరుగుతుందనీ, త్వరలోనే నూతన మెడికల్ కాలేజ్ భవనం శంకుస్థాపన జరుగుతుందని విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో హాస్టల్ సౌకర్యంతో మెడికల్ కాలేజ్ నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. మీరు మెడికల్ వృత్తిని ఎంచుకొని ప్రజలకు సేవ దృక్పథం తో పని చేయాలని సూచించారు. మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల న్నారు. అదేవిధంగా గద్వాల ప్రాంతానికి కూడా మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గద్వాల ప్రాంతంలో మెడికల్



మెడికల్ కాలేజీ బృందంతో ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి

కాలేజీ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేయడం జరిగింది ఎమ్మెల్యే కృషితోనే నేడు మెడికల్ కాలేజీ రావడం జరిగిందని తెలిపారు. మెడికల్ కాలేజీ ఏర్పాటులో విద్యార్థులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు లెక్చరర్స్ అన్ని విషయంలో ఎమ్మెల్యే ఎక్కడ కూడా రాజీ పడలేదన్నారు. ఈ ప్రాంతంలోని మెడికల్ కాలేజీ విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందిస్తే వారు భవిష్యత్తులో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా ఉంటారని ఉద్దేశంతో ఒక నిర్ణీతమైన లక్ష్యంతో గద్వాల ప్రాంతం అభివృద్ధి వైపుగా అడుగులు వేసే దిశగా అహర్నిశలు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ సర్పంచ్ మహబూబ్, నాయకులు శ్రీరాములు, వీరేష్ హాస్పిటల్స్ సూపర్డెంట్, ఏ.డి రమేష్, మెడికల్ కాలేజ్ లెక్చరర్స్ అండ్ డాక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ విద్యా విధానాన్ని అలవర్చుకోవాలి

◆ పోటీ ప్రపంచంలో రాణించాలి ◆ ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో విసి శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 30 ప్రభాతవార్త:** విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే ముందుగా రోజు తరగతులకు హాజరుకావాలని అలాగే లైబ్రరీ కి వెళ్లి కాంపిటీటివ్ బుక్స్ చదవాలని పాలమూరు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. పాలమూరు విశ్వవిద్యాలయం లైబ్రరీ ఆడిటోరియంలో ఎస్‌ఎఫ్‌ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథి గా పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. జిఎన్ శ్రీనివాస్ హాజరయ్యారు. ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఖాళీ సమయంలో సమయము వృధా చేయకుండా ఆటలలో కూడా నైపుణ్యం సంపాదించుకోవాలని సూచించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయం ఎస్‌ఎఫ్‌ఐ శాఖ నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందినటు వంటి విద్యార్థిని విద్యార్థులకు పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి బహుమతులు ప్రధానం చేసినారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ కో కన్వీనర్ మమత, జిల్లా కార్యదర్శి భరత్, యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాము, రాజేష్ యాదవ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శేఖర్, అరవింద్, విజయ, పూజ, విద్యులత, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న వీసీ శ్రీనివాస్

# నిర్ణీత సమయానికి దుకాణాలు మూసేయాలి

● డీఎస్పీ వెంకటేశ్వర్లు ● మద్యం దుకాణ యజమానులకు సూచనలు

**మహబూబ్‌నగర్, డిసెంబరు30 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు మంగళవారం మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డిఎస్పి వెంకటేశ్వర్లు, మహబూబ్‌నగర్ వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ, మైనర్లకు మద్యం విక్రయించడం కఠినంగా నిషేధించబడిందని, అలాగే ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి మద్యం దుకాణాలుతప్పనిసరిగా మూసివేయాలని స్పష్టం చేశారు. నూతన సంవత్సరం వేడుకల పేరుతో చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరగకుండా దుకాణ యజమానులు అప్రమత్తంగా ఉండాలని, మద్యం సేవించి ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే సంబంధిత దుకాణ యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే దుకాణాలవద్ద గుంపులు ఏర్పడకుండా చూడాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. పోలీసు శాఖతో సమన్వయం పాటిస్తూ నిబంధనలు ఉల్లంఘించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, రూరల్ సిఐ గాంధీ నాయక్, ఎస్ఐ విజయ్ భాస్కర్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్పి వెంకటేశ్వర్లు, హాజరైన మద్యం దుకాణ నిర్వాహకులు

# వడ్ల కొనుగోలు గోల్‌మాల్‌పై విచారణ చేపట్టిన అధికారులు



డాటా ఎంట్రీ ఆపరేటర్‌తో విచారణ చేస్తున్న అధికారులు

వార్త ఎఫెక్ట్

**వీపనగండ్ల డిసెంబర్30, ప్రభాతవార్త;** వడ్ల కొనుగోలు గోల్మాల్ పై అనే అంశంపై మంగళవారం నాడు వార్త పేపర్లో వార్త ప్రచురణ జరిగిన విషయం తెలిసింది. అయితే ఈ విషయంలో మంగళవారం నాడు డిఆర్డిఏ అధికారులు గోపాల్దిన్నె గ్రామ రైతు వేదికలో విచారణ చేపట్టారు రైతుల సమక్షంలో దాదాపు 14,9735 రూపాయలు ఫ్రాడ్ జరిగినట్లుగా అధికారుల విచారణలో తెలిసింది. అయితే వీటికి సంబంధించి డాటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్‌ను రైతుల ఎదుట విచారణ డిఆర్‌డి డిఓ సరోజ, రాంబాబు వీపనగండ్ల ఏపీఎం మద్దిలేటి వారిసమక్షంలో విచారణ జరిగింది. అయితే జగదీష్ నో పలు ప్రశ్నలు అడిగారు ఇందులో మహిళా సంఘానికి పంపించినటువంటి గన్ని బ్యాగులు తీసుకుపోకుండా బ్యాగులు ఎక్కడ తెచ్చారు అనే విషయాలపై ఆరా తీశారు. ఇమామ్ రైస్ మిల్ కు గద్వాల పంపించినటువంటి వరి ధాన్యానికి ఆ రైస్ మిల్ వ్యక్తి ఏ విధంగా క్వాంటిటీ ఇస్తాడు అనే అంశాలపై చర్చించారు. అయితే రైతు చలమారెడ్డినిగ్రామం రంగవరం చెందిన వ్యక్తిని విచారించగా తాను ప్రైవేటుగా. బ్యాగులు కొనుగోలు చేసి ధాన్యం లారీ గద్వాల ఇమామ్ రైస్ మిల్ కు పంపడం జరిగిందని ఆయనతో వాంగమూలాని తీసుకున్నారు. అదేవిధంగా గోపాల్దిన్నె గ్రామానికి చెందిన రైతు దేవయ్యతో విచారించగా నేను గోపాలదిన్నె సెంటర్‌లనే నాకు ఇప్పుడు వచ్చినటువంటి 31,534 కాక అంతకన్నా ముందు ఐదేరాల నరకు సంబంధించి ఇదే సెంటర్లో వడ్లను అమ్మడం జరిగిందని దానికి నాకు డబ్బులు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ డబ్బులు కూడా వేరే వాళ్ళు 33 బ్యాగులు ఉన్నాయి. నీ అకౌంట్లో వేసుకోమని చెప్తే దానికి నేను వేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఆ డబ్బులను వెంటనే ఫోన్పే ద్వారా జగదీష్ ఖాతాలోకి వేయడం జరిగిందని ఆయన తెలిపారు. జగదీషను విచారించగా తాను బుక్ కీపర్ ను అడిగే చేశానని అతను తెలిపారు. బుక్ కీపర్ ను అడుగుతే వారి సంతకం ట్రక్ సీట్ లో ఉండాలి కదా అని అధికారులు అడిగినటువంటి దానికి అతనితో సమాధానం లేకపోవడం వల్ల ఈ విషయాలన్నింటిపై ఐదు మంది రైతు ఖాతాలలో 14 లక్షల 97,35 రూపాయలు పై విచారణ చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా తాండ్ర గ్రామ సర్పంచ్ కాయితి ఆశాదీప్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



**కల్వకుర్తి, డిసెంబర్30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులుగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామ సర్పంచ్ కాయితి ఆశాదీప్‌రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర నూతన సర్పంచ్‌ల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల సర్పంచులు ఏకాభిప్రాయంతో ఆయనను సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు భారీ సంఖ్యలో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సౌదని భూమన్న యాదవ్ నియామక పత్రం అందించారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాయితీ ఆశాదీప్ రెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్రంలోని అన్ని గ్రామాల సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం సమగ్ర అభి వృద్ధి సాధించేలా సర్పంచులందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. గ్రామాల మధ్య సమన్వయం పెంచి, స్థానిక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో సర్పంచుల సంఘం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు... గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, పాఠశాలలు, ఆరోగ్య సదుపాయాల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. గ్రామపంచాయతీలకు సంబంధించిన నిధుల కేటాయింపులు, అభివృద్ధి పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను సమిష్టిగా పరిష్కరించేందుకు సర్పంచులందరితో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా సర్పంచులందరూ సమన్వయంతో పనిచేయాల్సి న అవసరం ఉందని అన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా, రాజకీయాలకు అతీతంగా సర్పంచుల సంఘాన్ని బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని కాయితీ ఆశాదీప్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**కౌకుంట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి**

**దేవరకద్ర, డిసెంబరు 30 ప్రభాతవార్త:** విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కౌకుంట్ల మండల అధ్యక్షులు ఎం. రాఘవేంద్రరెడ్డి అన్నారు. కౌకుంట్ల మండలం ఇస్రంపల్లి గ్రామంలో యువతకు స్పోర్ట్స్ కిట్టును మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో విజయం అనేది నిరంతరం అభ్యాసనతో సాధ్యపడుతుందన్నారు. ఉపాధ్యాయులు క్రీడల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థిని, విద్యార్థులను గుర్తించి, వారిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పోర్ట్స్ ఆడుతూ చదువును నిరక్ష్యం చేయొద్దని, ఉన్నతమైన చదువులు చదువుకుని ఇస్రంపల్లి గ్రామానికి, తల్లిదండ్రులకు, మంచి పేరు తీసుకురావాలని కోరారు. స్పోర్ట్స్ కిట్టును అందజేసిన సందర్భంగా యువకులు మండల అధ్యక్షులు మాదిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి, సర్పంచ్‌గొల్ల కృష్ణయ్యకి, ఉప సర్పంచ్ ఎండి సలాంకి, శాల్వాతో ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కావలి రాజు, కాంగ్రెస్ పార్టీనాయకులు రాజ్ మహమ్మద్, కురువ మన్యం, వాకిటి కృష్ణయ్య, నహీద్, ఉషన్న, బోయ బుచ్చన్న, షబ్బీర్, జాంగిర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జాతీయ విద్య విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలకు సిద్ధం కావాలి

**అమరచింత డిసెంబర్30, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానాన్ని అమలు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని నూతన విద్య విధానానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్‌ఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు కేరాఘవ పిలుపునిచ్చారు. మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని దగ్గర ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలపై నిరంతరం 56 సంవత్సరాలు పాటు ఉద్యమాలు చేసిన ఘనత ఎస్‌ఎఫ్‌ఐకే ఉందని ఆయన అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యార్థులు చదువుకుంటున్న పాఠ్యపుస్తకాలపై రామాయణం, మహాభారతం ముద్రించడం వల్ల విద్యార్థుల మనోభావాలు దెబ్బతింటున్నాయని వెంటనే కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం పోరాటం వల్ల హాస్టల్ విద్యార్థుల మెస్ బిల్లులు చార్జీలు పెంచడం జరిగిందని అలాగే ఆయా పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని ఆయన తెలిపారు. నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘానికి విద్యార్థులు అండగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, సంజయ్, రమేష్, అప్రోచ్, రాజేష్, అఖిల్, సంతోష్, విశాల్ పాల్గొన్నారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**అమరచింత డిసెంబర్30, ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని అమరచింత మున్సిపల్ కమిషనర్ సిహెచ్ నాగరాజ్ విద్యార్థులను కోరారు. మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల ఆవరణలో దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలను ఆయన ప్రారంభించారు. తెలంగాణ మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గత 15ఏళ్లుగా విద్యార్థులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లోప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో క్రీడల్లో రాణించాలని ఆయన విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, ఆత్మకూర్ మాజీ మార్కెట్ చైర్మన్, ఎస్ ఏ రాజు, దేశాయ్ ప్రకాష్ రెడ్డి సేవాసమితి అధ్యక్షులు, కలంపాష, మాజీ ఎంపిటిసి మహంకాళి విష్ణు, ఏకే వెంకటేశ్వర్ రెడ్డి, రాకేష్‌గౌడ్, ఉపాధ్యాయులు రవి, సిఆర్‌పి, స్వామి, అర్జున్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ పంట వైపు రైతులు మొగ్గు చూపాలి

**మండల వ్యవసాయ అధికారి ఏ.డాకేశ్వర్ గౌడ్**

**వీపనగండ్ల డిసెంబర్ 30, ప్రభాతవార్త;** ఆయిల్ ఫామ్ తోటలపై రైతులు ముగ్గుచూపాలని వీపనగండ్ల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం నాడు ఆయిల్ ఫామ్ తోటలో క్షేత్ర ప్రదర్శన చేయడం జరిగింది. అందులో భాగంగా పంట మార్పిడి ఆయిల్ ఫామ్‌సాగు చేయాలిఅని రైతులకు సూచించడం జరిగింది. ఆయిల్ ఫామ్ పంటకు సంబంధించి రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాన్ని వివరించడం జరిగింది. సన్న, చిన్న కారు రైతులకి ఒక ఎకరానికి సంబంధించి మొదటి సంవత్సరంలో మొక్కలకు, యాజమాన్య, డ్రిప్ పరికరాల కోసం38,318 రూపాయలు సబ్సిడీ రూపంలో ఇవ్వడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం పంట యాజమాన్యాల కోసం4200 రూపాయలు ఇవ్వడం జరుగుతుంది. మొదటి సంవత్సరం నుంచినాలుగు సంవత్సరం వరకు ఒక ఎకరాకి సంబంధించి 50,918 రూపాయలు రైతులకు ఇవ్వడం జరుగుతుంది. పంటదిగుబడి చూసినట్లయితే మూడు సంవత్స రాలలో టన్నులు ఒక ఎకరాకు3 టన్నులు వస్తుంది. ఏడు సంవత్సరాలలో నుంచి 810 టన్నులు వస్తుంది. పంట గురించి ఎలాంటి సమాచారంరైతులకు కావాలన్నా వ్యవసాయమరియు ఉద్యా నవన శాఖ అధికారులనుసంప్రదించగలరు. కార్యక్రమంలో ఏవో డా. కేశ్వర్‌గౌడు, ఏఈఓ అభిలాష్, హెచ్‌ఇఓ, రైతులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా ఆర్థిక సాయం

**దేవరకద్ర, డిసెంబరు 30 ప్రభాతవార్త:** గత రెండు సంవత్సరాల నుండి పార్టీలకు అతీతంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారు గుడిబండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌని అమరేశ్వర్ రెడ్డి. మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం గుడిబండ గ్రామానికి చెందిన మాదిగ బాలమ్మ మృతి చెందడంతో విషయాన్నితెలుసుకొని బాధిత కుటుంబానికి రూ.5000ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అమరేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గుడిబండ గ్రామంలో గత రెండు సంవత్సరాల నుండి పార్టీలకు అతీతంగా తనకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజాశ్రయస్సే లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలో పేదలకు సహాయం అందించి వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసింహులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి

**ఎస్ఐ శివానంద్ గౌడ్**

**రాజాపూర్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడంలో యువత చిల్లర చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజాపూర్ ఎస్ఐ శివానంద్ గౌడ్ హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకల కోసం రోడ్లపై డ్యాన్సులు చేయడం, మద్యం సేవించి న్యూసెన్స్ చేయడం వంటి చిల్లర వ్యవహారాలు చేయడం తగదన్నారు. డిసెంబర్ 31న రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిఘా పెడతామని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధుల్లో కేకులు కట్ చేయడం, డీజేలు పెట్టి హంగామా చేయరాదన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత రోడ్లపై తిరగకూడదని, ఎవరైనా పోలీస్ ఆంక్షలుఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. సౌండ్ పొల్యూషన్ ఉన్నా చర్యలుచేపట్టి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

# భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు


పాలెం వెంకన్న ఆలయంలో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనిధి దంపతుల పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**బిజినేపల్లి, డిసెంబరు30 ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశి వేడుకలు మండలంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే వైష్ణవాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పాలెం,వట్టెం, నంది వడ్డేమాన్, గంగారం దేవాలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి జనం పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవాలయాల వైకుంఠ ద్వారాలు తెరుచుకోవడంతో దేవాలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. అంతకు ముందు మూల విరాట్టుకు అర్చకులు ఏకాంతంగా కైంకర్యాలను నిర్వహించారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం వైకుంఠ ద్వారాలను అర్చకులు తెరిచారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక విశిష్టత ఉందనీ, ఈ రోజున విష్ణుమూర్తి వైకుంఠ ద్వారాలు తెరుస్తారనీ, ఆయనను దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం అన్నారు. స్వర్గద్వార ఏకాదశి అని కూడా పిలిచే ఈ రోజునే మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తారని పురాణాలు చెబుతున్నాయి అని వివరించారు. పాలెం వెంకన్న ఆలయంలో ప్రిన్సిపల్, జిల్లా జడ్జి డి.రమాకాంత్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనిధి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.వట్టెంఆలయ వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్‌రెడ్డి, సందడి నరేందర్ రెడ్డి, చంద్రా రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, జితేందర్ రెడ్డి,అన్నసత్రంకమిటీ నిర్వాహకులు బాదం కృష్ణయ్య, హకీమ్ విశ్వనాథ్, రాజేష్, ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

**శ్రీరంగాపూర్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి కుటుంబ సమేతంగా ఉత్తరద్వార దర్శనం చేసుకోవడం జరిగింది.

**ఉప్పునుంతల, డిసెంబరు30 ప్రభాతవార్త :** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల శివాలయం, మామిళ్ళపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, వెల్టూర్‌లో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివుని దర్శించుకున్నారు. ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ఉప్పునుంతల, మామిళ్ళపల్లి, దాసర్లపల్లి, దేవదారి కుంట తండా అదేవిధంగా బల్మూరు మండలం తుమ్మన్ పేట సర్పంచులు చింతగాళ్ళ శ్రీనివాసులు, మొకురాల మోహన్ గౌడ్, రమేష్ రెడ్డి, రతన్ సింగ్‌లను ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, సతీమణి నివేదిత వారిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆలయాన్ని దర్శించుకున్న వారిలో ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, సతీమణి నివేదిత,కమిటి సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

**ఆత్మకూర్ డిసెంబర్ 30,ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైనఆత్మకూరు పట్టణంతోపాటుగా మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం రోజు వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తులు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా పట్టణ ప్రముఖులు మొగిలి శ్రీధర్ గౌడ్ ఆత్మకూరు మున్సిపల్ మాజీ చైర్పర్సన్ గాయత్రీ రవికుమార్ యాదవ్ తదితరులు ప్రత్యేక దర్శనం చేసుకుని పండితుల చేత ఆశీర్వచనాలు పొందారు. మండలంలోని విధ గ్రామాలలో సైతం దేవాలయాలను ప్రత్యేకంగా అలంకరించి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని చిన్న పెద్ద తరతమేం లేకుండా పెద్ద ఎత్తున భక్తులు దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు... మూలమల్ల గ్రామంలో పాండురంగ ఆంజనేయ స్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుండి సుప్రభాత సేవ నిర్వహిస్తూ పండితులు సునీల్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**మక్తల్ టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో వెలసిన శ్రీశ్రీ నగరేశ్వరస్వామి దేవాలయం శ్రీపడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉదయం నుండి భక్తులు ఆలయాలకు విచ్చేసి తమ కోరికలు కోరుకుని భక్తులు తమ మొక్కులను సమర్పించుకున్నారు. వెంకటేశ్వర స్వామి అవతారంలో ఉన్న జనార్ధన స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. కొన్ని సంవత్సరాల పురాతన ఆలయంలో ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకుని తమ కోరికలను నెరవేర్చాలంటూ స్వామిని వేడుకున్నారు. మక్తల్ పట్టణ పరిసర గ్రామాల నుండి కూడా భక్తులు తండోపతండాలుగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించారు.నగరేశ్వర స్వామి వారిని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహగౌడ్, బిఆర్ఎస్ నాయకులు, మక్తల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు మొగిలప్ప,జగ్గలిరాములు,చందాపురం అశోక్, కుమార్ గౌడ్, ఎలిగండ్ల బాలప్ప, కురువ వినోద్, అమ్రేష్ తదితరులు దర్శించుకున్నారు.

**చిన్న చింతకుంట, డిసెంబరు30 ప్రభాతవార్త :** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరుడి ప్రతి రూపంగా కొరవబడుతూ, పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు శ్రీకురుమూర్తి రాయుడుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పుష్య మాసం శుక్లపక్షంలో వచ్చే వైకుంఠ ఏకాదశి చాలా విశిష్టమైనది. దీన్నే సర్వే ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, మోక్షద ఏకాదశి అని కూడా పిలుస్తారు. ఉత్తర ద్వార దర్శనంతో శ్రీవారిని దర్శించుకుంటే కష్టాలు తొలగి సుఖ సంతోషాలతో జీవిస్తారని భక్తుల విశ్వాసం.శ్రీకురుమూర్తి స్వామి దేవస్థానంలో స్వామి వారి ప్రధాన ఆలయంలో అందమైన పూలతో ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేసి శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

**కల్వకుర్తి, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీ లక్ష్మి ప్రద్మావతి వెంకటేశ్వరస్వామి, వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో, శ్రీ కోనకమల జనార్ధన స్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం 4.45 గంటల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ, వేంకటేశ్వర స్వామి ఆలయలు ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారాదర్శనం చేసుకోవడం వల్లముక్కోటి దేవతలు కొలవు తీరి ఉంటారని ఈ రోజు వైకుంఠ ఉత్తర ద్వారా శ్రీమహావిష్ణువు భక్తులకు దర్శనమిస్తారని పురోహితులు చెబుతున్నారు.శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవాలయం చైర్మన్‌పొందర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు, శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ పొందర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

**వెల్దండ, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని శ్రీ పాండురంగ నాయక దేవాలయంలో వైకుంఠఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ దంపతులు వ్రతాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.







మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, రిటైర్డ్ టీచర్ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీను, ముదిరాజ్ మదన్ గౌడు, రామాచారి తదితరులు ఉన్నారు.

**రాజాపూర్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ముక్కోటి ఏకాదశి పవిత్ర పర్వదినం సందర్భంగా ముక్కోటి దేవతలతో ఉత్తరద్వారా దర్శనమిచ్చే ఆ మహా విష్ణువు దివ్యానుగ్రహంప్రజలందరిపై ఉండాలని మోత్కులకుంట గ్రామ ఉపసర్పంచ్ జగన్‌నాయక్, వార్డు సభ్యులు శ్రీకాంత్‌నాయక్, మల్లేపల్లి గ్రామవార్డు సభ్యులు సంజీవ్ నాయక్‌లు ఆకాంక్షించారు.వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం మన్యంకొండ శ్రీ వేంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రజలందరినీ చల్లగా చూడాలని ఆ భగవంతున్ని వేడుకున్నట్లు వారు తెలిపారు.

**జడ్చర్ల, డిసెంబరు30 ప్రభాతవార్త :** ముక్కోటి ఏకాదశి శుభ సందర్భంగా ఈ పవిత్రమైన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని, గ్రామ ప్రజల సౌఖ్య-సమృద్ధి, వర్షాభావ నివారణ, భూగర్భ జలాల పరిరక్షణ లక్ష్యంగా జడ్చర్ల లోని వెంకటేశ్వరా స్వామి ఆలయం వద్ద గచ్చు బావికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మహావిష్ణువు కృపతో గ్రామానికి శుభాలు కలగాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాము. నీరు జీవనాధారం అనే భావనతో, ప్రకృతి సంపదలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ పూజల ద్వారా గుర్తుచేసుకున్నాము. మంగళవారం సాయంత్రం ముక్కోటి ఏకాదశి సందర్భంగా సామూహిక దీపారాధన గంగా హారతి ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్స్ జ్యోతి, కోట్లప్రశాంత్ రెడ్డికుమ్మరి రాజు,బుక్క మహేష్, పాలాది రామ్ మోహన్ మహేశ్‌గౌడ్,జైపాల్, రఘు రెడ్డి, ధర్మరాజు, గ్రామ ప్రజలు హనుమాన్ చాలీసా భక్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ క్రైమ్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల సందర్శన అధికంగాఉన్న నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి మంగళవారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు జిల్లాలో వివిధ ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని,ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కట్టుదిట్టమైన నియంత్రణ చేపట్టాలని అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు,సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచనలు జారీచేశారు. భక్తులు ప్రశాంతంగా, సురక్షితంగా స్వామివారిదర్శనం చేసుకునేలా జిల్లాపోలీస్ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.


ఆలయంలో కిటకిటలాడిన భక్తులు


మామిళ్ళపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


సామూహిక దీపారాధన చేస్తున్న దృశ్యం


భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా చౌదర్ల రేణుక

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కార్వంగా గ్రామానికి చెందిన చౌదర్ల రేణుకను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలిగా నియమించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, తెలంగాణ మహిళ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.పద్మ ఆమెకు నియామక పత్రాన్ని అందించారు. తెలంగాణ బీసీ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలిగా చౌదర్ల రేణుకను నియమించడం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య,తెలంగాణ బీసీమహిళా సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు జి.పద్మలతో పాటు, ఈ పదవి రావడానికి సహకరించిన నాగర్‌కర్నూలు జిల్లా బీసీ సంక్షేమ సంఘంయువజన విభాగం అధ్యక్షులు ముదగుల తిరుపతయ్య, ఉపాధ్యక్షులు రామకృష్ణ, యం.నిరంజన్ తదితరులకు రేణుక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ బీసీల సంక్షేమం కోసం మహిళా సంక్షేమం కోసం పాటుపడతానని ఆమె తెలిపారు. జిల్లా తెలంగాణ బిసి మహిళ అసోసియేషన్ అధ్యక్షురాలిగా నియమితులైన చౌదర్ల రేణుకకు ఆసంఘం రాష్ట్ర కార్యాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, మహిళా సంఘంరాష్ట్ర అధ్యక్షురాలు జి.పద్మల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించి ఆమెను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## మార్నింగ్ వాక్‌లో సమస్యలు తెలుసుకున్న సర్పంచ్

**వెల్దండ, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చౌదర్‌పల్లి గ్రామ సర్పంచ్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి గ్రామంలోని కాలనీలలో మంగళవారం ఉదయం నడక ద్వారా నడుచుకుంటూ గ్రామంలోని కాలనీలను పరిశీలిస్తూ ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి ఎంతో తోడుబాటనందించరాని, రానున్న రోజుల్లో మీ నాయకత్వంలో గ్రామం అన్ని రంగాల అభివృద్ధి చెందుతుందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజీవ్, వార్డు సభ్యులు పుష్పలత, చంద్రశేఖర్, రమేష్, జంగయ్య, సాయి, విజయ, శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి హాజీ బాబా ఉన్నారు.

## రాష్ట్రస్థాయి మిమిక్రీ పోటీల్లో ఏకలవ్య విద్యార్థికి ద్వితీయ బహుమతి

**వెల్దండ, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** మండలంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు నందు డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ గారి జయంతి సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి మిమిక్రీ పోటీల్లో ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.వెంకటేష్‌అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ బహుమతితో పాటురూ.7,500ల నగదు బహుమతిని గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి వి.నిత్యానంద రావు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు కె.వి.రమణాచారి, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల కార్యదర్శి కె. సీతాలక్ష్మి, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ గారి సతీమణి శోభా వేణుమాధవ్, సినీ నటుడు మరియు మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి గార్లు విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా విజేత వెంకటేష్‌ను ఏకలవ్య ప్రిన్సిపల్ సుమన్‌కుమార్,వైస్ ప్రిన్సిపల్ కోదండభాస్కర్, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

## వంట గ్యాస్ డీసీఎం-కారు ఢీ
### పలువురికి గాయాలు

**వెల్దండ, డిసెంబర్30 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్ర సమీపంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారి ఏవిఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఖాళీ సిలిండర్ల వంట గ్యాస్‌తో బయలుదేరిన లారీకారు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.హైదరాబాదు నుండి డిండికి వెళ్తున్న రుక్మారెడ్డి ఆయన భార్య అరుణమ్మలు, కల్వకుర్తి నుండి హైదరాబాద్ వంట గ్యాస్ ఖాళీ సిలిండర్లతో బయలు దేరిన లారీ డ్రైవర్ కృష్ణయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్ఐ కురుమూర్తి చేరుకొని క్షతగాత్రులను యెన్నం హాస్పిటల్ కు తరలించి వాహనాలను రోడ్డుపై నుంచి ప్రక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## బ్యాంక్ ఖాతా నుంచి రూ.5.85 లక్షలు మాయం
### మనస్థాపంతో యువకుడి మృతి


మృతి చెందిన యువకుడు ఇర్ఫాన్

**నారాయణపేట, డిసెంబరు 30ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణానికి చెందిన ఇర్ఫాన్ అనే యువకుడి బ్యాంక్‌ఖాతా నుంచి అనుమతి లేకుండా భారీగా నగదు మాయమైందని మనస్థాపం చెంది ఇర్ఫాన్ అనే యువకుడు ఉరి వేసుకొని చనిపోయాడు. బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఇర్ఫాన్ పేరిట ఉన్న బ్యాంక్‌ఖాతా నంబర్ అకౌంట్: 1524 1100001103 నుంచి 13.11.2025 నుంచి30.12.2025 మధ్య కాలంలో మొత్తంరూ.5,85,000 నగదు డ్రా చేయబడినట్లు తెలిపారు. ఖాతాదారుడి సమ్మతి లేకుండా, ఎలాంటి ఎన్‌ఓసీ కూడా లేకపోయినా ఈ లావాదేవీలు జరిగా యని మృతుని తండ్రి ఆరోపించారు. ఈ ఘటన వల్ల తమ కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు చెప్పారు.

## వాహనం ఢీకొని నాలుగు గేదెలు మృతి

**శ్రీరంగాపూర్, డిసెంబరు30 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలంలోని షేర్ పల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములైన మునయ్య, చింతలయ్య కు చెందిన ఐదు గేదెలు షేర్ పల్లి గ్రామ శివారులో మృతి చెందాయి. సోమవారం రాత్రి సమయంలో జరిగినరోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై వెళ్తున్న 5 గేదెలు గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా అందులో 4గేదెలు అక్కడికక్కడే చనిపోగా ఒక బర్రెకు తీవ్ర గాయాలయ్యాయి.వీటి విలువ మొత్తం సుమారు రూ. 1,70,000/ ఉండవచ్చు. మునయ్య ఈ విషయంపై ఫిర్యాదు చేయగా శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలియజేయడం జరిగింది.

## న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి
### లేదంటే కఠిన చర్యలు తీసుకుంటాం: జడ్చర్ల సిఐ కమలాకర్

**జడ్చర్ల, డిసెంబరు 30 ప్రభాతవార్త :** జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలోన్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఇతరులకు ఇబ్బందులు కలగకుండా 2025 ముగింపు పలికి 2026 స్వాగతం పలకాలని జడ్చర్ల సిఐ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని మంగళవారంవిడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన న్యూఇయర్ వేడుకల గురించి సూచనలను సలహాలను అందజేశారు. జడ్చర్ల సర్కిల్లో 31 డిసెంబర్ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని మద్యం సేవించి పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.మద్యం సేవించి రోడ్లపైకివచ్చి ప్రమాదాలకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వారి వారి కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా అనేక పర్యాయాలు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఎంతోమంది మృతి చెందారని అలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకొని సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అర్హులైన విద్యార్థులందరూ ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేలా సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన రెవెన్యూ అధికారులు ఇచ్చేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు.ఆయా మండలాల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడినీ నోడల్ అధికారిగా నియమించి విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేలా బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు బ్యాంకులేదా పోస్టల్ ఖాతాలుత్వరితగతిన పొందేలా సంబంధిత అధికారులు సహకరించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని నుషిత, బీసీ సంక్షేమశాఖ అధికారి అక్బర్‌పాషా,లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, ఆయా మండలాల విద్యాధికారులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో నాకాబందీ
### అక్రమ కార్యకలాపాలపై కఠిన నిఘా

**మహబూబ్‌నగర్ క్రైమ్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సాయంత్రం నుండి విస్తృత స్థాయిలో నాకాబందీ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ నాఖాబందిలో భాగంగా అనుమానాస్పద వాహనాలు మరియు వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు, అక్రమరవాణా, మత్తుపదార్థాలు, అక్రమ ఆయుధాలు, అలాగే నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు.తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు, 6 కార్లు, 12 ఆటోలు గుర్తించబడగా, వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు తరలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ"జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా ఉంచడం, నేరాలకు అడ్డుకట్ట వేయడం, ప్రజలకు భద్రతా భావాన్ని కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవు. ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించి, ఏవైనా అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి" అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి నాఖాబంది తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేశారు.



## అన్ని ప్రభుత్వ పాఠశాలలో వసతులు ఉండేలా చర్యలు
### మంజూరైన పనులను జనవరి మొదటి వారంలోపు పూర్తి చేయాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, డిసెంబరు 30 ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం తప్పక ఉండాలని, లేని పాఠశాలల్లో నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో శౌచాలయాలు, అంగన్‌వాడీల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం అంశాలపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మరుగుదొడ్ల సౌకర్యం లేని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన నివేదికను విద్యాశాఖ అధికారుల ద్వారా తెప్పించుకుని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్ల సౌకర్యం లేని పాఠశాలల్లో ఎన్‌ఆర్ఈజీఎస్ కింద టాయిలెట్స్ మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు త్వరిత చేపట్టాలని, మార్చి 31వ తేదీ లోపు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని 35 అంగన్వాడీ కేంద్రాల్లో ఈ డబ్ల్యూ ఐడిసి ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో తాగునీటి వసతి కోసం చేపట్టిన పనులపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు కేవలం 9 అంగన్వాడీల్లో మాత్రమే తాగునీటి వసతికి పనులు పూర్తి చేసినట్లు, ఇంకా 26 అంగన్‌వాడీల్లో పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పగా ఆయా పనులని జనవరి మొదటి వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అంగన్‌వాడీల్లో టాయిలెట్లు నిర్మాణం కోసం మంజూరైన పనులను కూడా జనవరి మొదటి వారంలోపు పూర్తి చేయాలని ఈడబ్ల్యుఐడీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంతేకాకుండా, ప్రభుత్వానికి చెందిన పలు శాఖల పరిధిలో గత పదిహేళ్లుగా క్లైమ్ చేయని బ్యాంకు అకౌంట్లు ఉంటే వాటి సమాచారం తెలుసుకొని వెంటనే వాటిని ఆక్టివేట్ చేసుకోవాలని సూచించారు. తద్వారా ఆయా క్లైమ్ చేయని అకౌంట్లో ఉన్న నగదును ప్రజా ప్రయోజనార్థం పనులకు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అన్ని పాఠశాలల్లో కలెక్టర్ నిధుల నుంచి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించడం జరిగిందని, ఇప్పుడు ఆయా పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్ వినియోగిస్తున్నారా ఇంకా కట్టెల పొయ్యి మాత్రమే వాడుతున్నారా? అన్ని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆరా తీశారు.తప్పనిసరిగా అన్ని పాఠశాలల్లో గ్యాస్ సిలిండర్ ద్వారా మాత్రమే వంట చేయాలని కట్టేల పోయి వినియోగించడం జరగవద్దని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిని ఉమాదేవి, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లు వేగవంతం చేయాలి
### 26,015 మంది రైతుల నుంచి 1,30,459 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
### అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్


ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు30 ప్రభాతవార్త:** ధాన్యం సేకరణ వేగవంతం చేసి పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. వానకాలం 2025-26 ధాన్యంసేకరణపై మంగళవారం పౌర సరఫరాల శాఖ అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, మొత్తం సేకరణ ప్రక్రియను అత్యంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లర్ల నుండి పొందిన బ్యాంక్ గ్యారంటీలను (బిజిలు) పరిశీలించగా, మిల్లర్లకు అందజేసిన పాడికి సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ గ్యారంటీలను మూడు (03) రోజుల్లో ఖచ్చితంగా సేకరించాలని సంబంధిత పౌర సరఫరాల శాఖ డిటిలను ఆదేశించారు. అదేవిధంగా రబీ 2024-25 సీజన్‌కు సంబంధించిన సిఎంఆర్ డెలివరీ పై సమీక్ష నిర్వహించారు. మిల్లింగ్ సామర్థ్యానికి అనుగుణంగా మిల్లులను రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తూ సిఎంఆర్ డెలివరీ లను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. డిసెంబర్ 29 నాటికి జిల్లాలో 26,015 మంది రైతుల నుంచి మొత్తం 1,30,459 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. మొత్తం 312 కోట్ల మద్దతు ధరకు గాను, 24,072 మంది రైతులకు 295 కోట్లు చెల్లించగా, మిగిలిన 17 కోట్లు రెండు (02) రోజుల్లో విడుదల చేయబడతాయని అధికారులువివరించారు.బోనస్ మొత్తానికి సంబంధించి మొత్తం రూ. 36.24 కోట్లకు గాను, 7,971 మంది రైతులకు రూ.21.95 కోట్లు చెల్లించబడినట్లు తెలిపారు. మిగిలిన రూ.14.29 కోట్లు ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుండగా, అందుకు సంబంధించిన అన్ని వివరాలు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేయబడినట్లు తెలిపారు.జిల్లాలో ధాన్యం సేకరణ, సిఎంఆర్ డెలివరీ ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ డిఎం రవి నాయక్, పౌర సరఫరాల డిటిలు పాల్గొన్నారు.